ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.08-07-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం కేంద్రం ప్రభుత్వం సుమారు 303 కోట్ల రూపాయలు కేటాయించింది.
2. సంగారెడ్డి జిల్లాలోని పారిశ్రామిక వాడలో ప్రమాదానికి గురైన సిగాచి పరిశ్రమను జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారుల బృందం ఈ రోజు పరిశీలించనుంది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 44కు చేరుకుంది.
3. కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జాతీయ చేనేత పురస్కారాలు -2024 కి గాను తెలంగాణకు చెందిన ఇద్దరు చేనేత కార్మికులు ఎంపికయ్యారు.
4. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు.

-------------------------

**కంటోన్మెంట్-కిషన్ రెడ్డి**

కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చొరవతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం సుమారు 303 కోట్ల రూపాయలు కేటాయించేందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అంగీకరించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల కోసం కంటోన్మెంట్ భూములను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీకి (HMDA) బదిలీ చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం జమ చేసే భూబదిలీ పరిహారాన్ని కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా అకౌంట్‌లో కాకుండా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు

అనుబంధంగా ఒక ఎస్క్రో అకౌంట్‌ను ఏర్పాటు చేసి, నేరుగా అందులో జమ చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రక్షణ శాఖ మంత్రికి రెండు సార్లు లేఖలు రాశారు. వెంటనే స్పందించిన రక్షణ శాఖ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు అనుబంధంగా ఎస్క్రో అకౌంట్‌ను ఏర్పాటు చేసి, ఆ నిధులను స్థానికంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి మాత్రమే ఖర్చు చేయాలని రాజ్‌నాథ్ సింగ్ ఆదేశించారు. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

**(పీఎస్)**

---------------------------

**సిగాచీ మృతులు**

సంగారెడ్డి జిల్లాలోని సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 44కు చేరుకుంది. ఈ విషాదకర ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు కార్మికులు అఖిలేష్ , ఆరిఫ్ ఈరోజు మరణించారు. ప్రమాదం జరిగి 9 రోజులు గడుస్తున్నా ఇంకా ఏడుగురు కార్మికుల ఆచూకీ లభించలేదు. పేలుడు ధాటికి ఛిద్రమైన శరీర భాగాలు పరిశ్రమలో యంత్రాలకు అతుక్కుపోయాయి. NDRF, SDRF, మున్సిపల్ సిబ్బంది పరిశ్రమ ఆవరణలో గల్లంతైన కార్మికుల అవశేషాల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. లభించిన అవశేషాలను కుటుంబ సభ్యుల DNAతో సరిపోల్చి గుర్తించాల్సి ఉంది. ఇదిలా వుండగా నేడు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించనుంది. ఈ బృందం పేలుడుకు గల కారణాలపై అధ్యయనం చేయడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా వివిధ పరిశ్రమలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదిక సమర్పించనుంది.

**(పీటీసీ, సంగారెడ్డి)**

-------------------------

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జాతీయ చేనేత పురస్కారం -2024 కి తెలంగాణకు చెందిన ఇద్దరు చేనేత కార్మికులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారికి అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 19 మంది చేనేత కార్మికులు ఎంపిక కాగా, అందులో మన తెలంగాణ నుంచి ఇద్దరికి పురస్కారాలు దక్కడం గర్వకారణమని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. యాదాద్రి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండలం, పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మదకు చేనేత వస్త్రాల మార్కెటింగ్ విభాగంలో 8 కోట్ల రూపాయలు టర్నోవర్ చేసినందుకు సహజ సిద్ద రంగులను ఉపయోగించి జీఐ ట్యాగ్ పొందిన తెలియా రుమాల్ డిజైన్ తో పట్టుచీరను నేసిన గూడ పవన్ కు జాతీయ చేనేత అవార్డుకు ఎంపికయి చేనేత రంగంలో ఆదర్శంగా నిలిచారని మంత్రి తెలిపారు.

**పీఎస్**

----------------------

**వెల్‌నెస్ సెంటర్ల ఆకస్మిక తనిఖీలు**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు పలు జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు, పాత్రికేయులకు వైద్య సేవలు అందించే వెల్‌నెస్ సెంటర్లలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వెల్‌నెస్ సెంటర్లపై వస్తున్న వార్తలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడంతో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో, గత రెండు రోజులుగా ఆరోగ్యశ్రీ సీఈవో,ఇతర ఉన్నతాధికారులు సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలు, హైదరాబాద్ లోని వనస్థలిపురం, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని వెల్‌నెస్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

**(పీటీసీ, సంగారెడ్డి)**

-------------------------

**వైఎస్ జయంతి-సీఎం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రాన్ని సంక్షేమ యుగానికి తీసుకెళ్లి, అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన నాయకుడు వైఎస్ రాజశేఖర రెడ్డి అని భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని పంజాగుట్టలో వైఎస్ ఆర్ విగ్రహానికి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఇతర నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలు ప్రజల హృదయాల్లో చిరకాలం నిలిచిపోతాయని పేర్కొన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ, వారి అడుగుజాడల్లోనే ప్రస్తుత ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందని చెప్పారు. మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ కూడా నివాళులు అర్పించారు.

**జిల్లాలు..**

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాజన్న సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లోనూ రాజశేఖర్ రెడ్డి జయంతిని నిర్వహిస్తున్నారు.

**(పీటీసీ, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, సిరిసిల్ల)**

------------------------

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ airnews_hyd ని ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel కి సబ్ స్క్రైబ్ చేయండి.

------------------------

**శ్రీశైలం ప్రాజెక్టు-గేట్లు**

ఎగువ నుంచి భారీగా వస్తున్న వరదతో శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఈ సాయంత్రానికి తెరుచుకోనున్నాయి. ప్రాజెక్టు నుంచి నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేయనున్నారు. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలంకు ప్రస్తుతం దాదాపు **లక్షా 75 వేల క్యూసెక్కుల** నీరు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం **881.80 అడుగులకు** చేరింది. గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా, మరో 3 అడుగులు మాత్రమే మిగిలి ఉంది. దిగువన ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 531అడుగులకు చేరింది.

**(పిటిసి నల్లగొండ జిల్లా)**

------------------------------

**కేటీఆర్-సీఎం**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని  కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు గురించి గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తమ పార్టీ నిలదీస్తుందని అన్నారు. రాష్ట్రంలో నది జలాల నీటి పంపకాలపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరిన ఆయన ఈ  ఉదయం హైదరాబాద్ లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బంది పడుతున్నారని, దాదాపు 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు.

------------ **బైట్ కల్వకుంట్ల తారక రామారావు** -----------

**(డెస్క్)**

--------------------------

**టీబీ ముక్త్-వికారాబాద్**

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "టీబీ ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమం వికారాబాద్ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. 2030 నాటికి దేశాన్ని క్షయ రహితంగా మార్చాలనే లక్ష్యంలో భాగంగా, వికారాబాద్ జిల్లాలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని, టిబి ముక్త్ భారత్ అభియాన్ జిల్లా అధికారి రవీందర్ యాదవ్ ఆకాశవాణికి తెలిపారు.

(బైట్ రవీందర్)

**పీటీసీ/వికారాబాద్**

-------------------------------

వాతావరణం

రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల పాటు ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది.

**(డెస్క్)**

------------------------

**CLOSING ANNOUNCEMENT**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం.. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.

---------------------------